క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతులలో భాగంగా బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ మంగళవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి 11గంటల వరకూ మార్కెట్ యార్డ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కోరుకొండ రోడ్డు ఏరియా, విద్యానగర్, పీఅండ్‌టీ కాలనీ, సుభాష్ నగర్‌లలో సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. నగరంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గాంధీపురం 3, శీలం నూకరాజు కంపెనీ లైన్, శ్యామలనగర్, గోరక్షణ పేట, డైమండ్ పార్క్ తదితర ప్రాంతాల్లో ఉండదని తెలిపారుజ

ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

కంబాలచెరువు : స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. జువాలజీ విభాగం విద్యార్థులు పాల్గొని దోమల వల్ల కలిగే వ్యాధులు, నష్టాలు, నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జువాలజీ విభాగాధిపతి సీహెచ్ ప్రియాంక, జి.దివ్యశ్రీ, పీఎస్‌సీహెచ్ పి.దీపికా రాణి, ఎం.కాస్మో, ఏకే శివరంజని పాల్గొన్నారు.

మానవత ఆవిర్భావ శాంతి ర్యాలీని జయప్రదం చేయండి

రాజమహేంద్రవరం సిటీ: మానవత సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న శాంతి ర్యాలీ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరం యూనిట్‌లో జరిగే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని మానవత అధ్యక్షులు పాల కృష్ణ ప్రసాద్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ మెంబెర్స్, మానవత సభ్యులు పాల్గొలని ఆయన తెలిపారు.

సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ సర్వీసింగ్ శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల వయస్సు, పదో తరగతి చదివినవారు అర్హులన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి 13 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు రాజమహేంద్రవరం ఆల్కాట్‌తోటలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థ కార్యాలయం, లేదా 77805 99939, 9014328803 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఎన్ఐటీ విద్యార్థికి ఎన్నారై చేయూత

కంబాలచెరువు : చదువుల్లో ముందున్న ఓ విద్యార్థి ఉన్నత విద్యకు పేదరికం అడ్డువచ్చింది. ప్రాథమిక స్థాయి నుంచి అన్నింటా అగ్రగామిగా నిలిచిన ఆ విద్యార్థి భోపాల్ ఎన్ఐటీకి ఎంపికయ్యాడు. తీరా అక్కడకు వెళ్లి చదువుకోవాలంటే హాస్టల్‌లో ఉండాలి. హాస్టల్‌లో ఉండేందుకు అంత మొత్తం సొమ్ము చెల్లించే స్థోమత ఆ కుటుంబానికి లేదు. తండ్రి ఆటో డ్రైవర్. ఈ పరిస్థితి తన స్నేహితుల ద్వారా తెలుసుకున్న ఒక ప్రవాస భారతీయురాలు ముందుకు వచ్చి ఆదుకున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన సప్పా పార్థుకు భోపాల్ ఎన్ఐటీలో హాస్టల్‌కు అయ్యే ఖర్చు రూ.35వేలు ఎన్ఆర్ఐ సముద్రాల శుభశ్రీ మంగళవారం అతని ఖాతాలో జమ చేశారు. ఆమె ప్రముఖ సినీ రచయితలు సముద్రాల సీనియర్, సముద్రాల జూనియర్‌ల వారసురాలు. పార్థు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి, ఇంటర్‌లో 98 శాతం, జేఈఈ మెయిన్స్‌లో 98.8 మార్కులు సాధించి ఎన్ఐటీ భోపాల్‌లో ఎలక్ట్రానిక్స్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా శుభశ్రీ, ఆమె స్నేహితులకు ఆ పేదకుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

సినిమాలు

శ్యామల	డబుల్ఇస్మార్ట్
సూర్యమినీ	తంగలాన్
సూర్యప్యాలెస్	డబుల్ఇస్మార్ట్
స్వామి	మిస్టర్‌బచ్చన్
అశోక	ఆయ్
శివజ్యోతి	మిస్టర్‌బచ్చన్
అనుశ్రీ	కమిటీకుర్రోళ్లు
రాజా	కమిటీకుర్రోళ్లు
రంభ	తంగలాన్
ఊర్వశి	డబుల్ఇస్మార్ట్
మేనక	స్త్రీ-2,వేదా
కుమారి	డబుల్ఇస్మార్ట్,మిస్టర్ బచ్చన్
అప్సర	మిస్టర్‌బచ్చన్
నామవరం	
వివిఎస్.మహల్	డబుల్ఇస్మార్ట్, మిస్టర్‌బచ్చన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	డబుల్ఇస్మార్ట్, మిస్టర్‌బచ్చన్
కడియం	
వెంకటసూర్య	డబుల్ఇస్మార్ట్, మిస్టర్‌బచ్చన్

కంటి మీద కునుకు లేదాయె..

- ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు
- పేరుకుపోతున్న చెత్త, మురుగు
- వృద్ధి చెందుతున్న దోమలు
- పట్టించుకోని స్థల యజమానులు
- రూరల్, సిటీ నియోజకవర్గాల్లో 10 వేలకు పైగా ఖాళీ స్థలాలు
- పంచాయతీలలో నోటీసులు, నగరపాలక సంస్థలో అపరాధ రుసుం వసూలు



బొమ్మూరు మురళీకొండపై ఇళ్ల మధ్య మురికి కూపంగా ఉన్న ఖాళీ స్థలం



నగరపాలక సంస్థ 16వ డివిజన్ ఆదర్శనగర్‌లో ఇళ్లల మధ్య ఖాళీ స్థలం

రాజమహేంద్రవరం రూరల్: కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న దోమలకు ఖాళీ స్థలాలు నిలయాలుగా మారుతున్నాయి. సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు కొంతమంది, ఆదాయ వనరులు పెంచుకునేందుకు మరి కొందరు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి వాటిని అలాగే వదిలేస్తున్నారు. ఈ స్థలాలు ఖాళీల్లో చెత్తాచెదారం, వర్షపునీరు పేరుకుపోయిగా మురికి కూపాలుగా మారుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పది వేల ఖాళీ స్థలాలు


రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో కడియం, రూరల్ మండలాలతో పాటు, రాజమహేంద్రవరం నగరపాకల సంస్థ పరిధిలో సుమారు 10 వేలకు పైగా ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఇళ్లస్థలాలు కొనుగోలు చేసిన యజమానులు పట్టించుకోకపోవడంతో ఆ స్థలాల్లో మొక్కలు, పొదలు తోపాటు, పరిసర ప్రాంత ఇళ్లల్లోని మురుగునీరు వచ్చి చేరడంతో మురికికూపంలా మారుతున్నాయి. దానిలో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దోమలు కుట్టడం వల్ల జ్వరాలు, అంటు వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ప్రజలు గ్రామ స్థాయిలో పంచాయతీ అధికారులకు, నగరపాలక సంస్థ పరిధిలో అధికారులకు విన్నవించడం, వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం ఉండడంలేదని వారు చెబుతున్నారు.

నోటీసులు ఇచ్చినా..

గ్రామ పంచాయతీలలో ఖాళీ స్థలాలకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఎటువంటి స్పందన రావడం లేదు. స్వయంగా పంచాయతీ కార్యదర్శి స్థల యజమానికి ఫోన్ చేసి ఖాళీ స్థలంలో మట్టిఫిల్‌చేసుకుని, పరిసర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేస్తున్నా ఎటువంటి చలనం ఉండడంలేదు. నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలకు నోటీసులు జారీ చేసి అపరాధ రుసుం కూడా వసూలు చేస్తున్నారు. దీని వలన నగరపాలక సంస్థ కొంత మేర ఆదాయం వస్తున్నప్పటికీ ప్రజలకు ఇబ్బంది పూర్తిస్థాయిలో ఖాళీ స్థలాలు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల మధ్య ఖాళీస్థలాల్లో మట్టి ఫిల్లింగ్ చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

> **ఇబ్బంది పడుతున్నాం**
>
> తమ ఇళ్ల మధ్య ఖాళీస్థలాలు వలన దోమలకు నిలయాలుగా మారింది. దీని వలన చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారులు సదరు స్థల యజమానితో మాట్లాడినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. స్వయంగా జిల్లా పంచాయతీ అధికారికి సైతం ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి.
>
> –సరస్వతి, విశ్రాంత ఎంపీడీవో, మురళీకొండ, బొమ్మూరు

రెండో పట్టణ సీఐగా దుర్గారావు బాధ్యతలు



సీఐగా బాధ్యతలు స్వీకరించిన దుర్గారావు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం రెండో పట్టణ సీఐగా వి.దుర్గారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పోలీస్ శాఖలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా దుర్గారావు టూ టౌన్ సీఐగా ఇక్కడకు వచ్చారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తానని, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, సారా వంటి నిర్మూలనకు కృషి చేస్తానని సీఐ దుర్గారావు తెలిపారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా అండర్-14, అండర్-17, అండర్-19 కేటగిరీలకు చెందిన ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ విద్యార్థులకు బుధవారం నుంచి రెండురోజులు పాటు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన సుమారు 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పరామర్శ



మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావును పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలో ఇటీవల శస్త్రచికిత్సలు చేయించుకున్న పలువురు వైఎస్సార్ సీపీ నేతలను మంగళవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు, కడుపులో ప్రేగుఇన్‌ఫెక్షన్‌తో సర్జరీ చేయించుకున్న రుంకాని రవికుమార్‌ను, రోడ్డు ప్రమాదంలో గాయపడిన పిల్లట్ల శివలను చందన నాగేశ్వర్ పరామర్శించి, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వారికి ఆర్థికసాయం అందించారు. మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్ బొమ్మశ్రీను, పార్టీనేతలు బత్తిన అప్పారావు, పుచ్చాగోవింద్, కాకుర్తిమురళి, సప్పావరప్రసాద్, బొజ్జాప్రకాష్, అద్దూరిశేఖర్, గోల్కొండ సతీష్, చాట్ల శ్రీను, వడిసెల నారాయణ, గొర్రెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి



రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరంసిటీ : దేశ అభ్యున్నతికి అనుక్షణం కృషి చేసిన ఐటీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ రంగాలను దేశానికి పరిచయం చేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా స్థానిక సీతంపేటలో రాజీవ్ గాంధీ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి పార్టీ నాయకుల పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. జిల్లా మహిళా పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గిడుగు రుద్రరాజు.

ఐటీ విప్లమానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ

భారత రత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ భారత దేశ అభివృద్ధికి చేసిన కృషి, యువత కోసం తీసుకొచ్చిన ఐటీ విప్లవం అభినందనీయమని పీసీసీ మాజీ చీఫ్, గిడుడు రుద్రరాజు అన్నారు. మంగళవారం నగరంలో రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా జాంపేట బ్రిడ్జ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రి విద్యా సంస్థల అధినేత టి.కె విశ్వేశ్వర్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, బోడా వెంకట్, బిల్డర్ బాబీ, బెజవాడ రంగ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కర్రి రామారెడ్డికి సత్కారం



డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరించిన అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అరసం తూర్పుగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు, నిత్య విద్యార్థి డాక్టర్ కర్రి రామారెడ్డి 38వ డిగ్రీ పొందిన సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జిల్లా శాఖ ఘనంగా సత్కరించింది. మంగళవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని మానస హాస్పిటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరసం జిల్లా శాఖ అధ్యక్షులు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ డాక్టర్ కర్రి రామారెడ్డి నిత్య విద్యార్థిగా 38 డిగ్రీలు, రాష్ట్రపతిచే అవార్డు పొంది రాజమహేంద్రవరానికే కాకుండా దేశానికే గర్వకారణంగా నిలిచారన్నారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా అరసం గౌరవ అధ్యక్షులుగా వ్యవహరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సంవత్సరం జనవరిలో పడాల రామారావు జీవితం-సాహిత్యం, ఇప్పుడు ఆగస్టు 15న 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విడుదలైన అల్లూరి సీతారామరాజు వాస్తవ చరిత్ర గ్రంథాల ముద్రణకు డాక్టర్ రామారెడ్డి సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో లోలభట్టు శ్రీనివాసరాజు, అరసం జిల్లా కార్యవర్గ సభ్యుడు బూడిద వీర్రాజు,రచయిత మల్లెమొగ్గల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం సీసీఆర్సీ కార్డుల డేటా ఎంట్రీ పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
- అధికారులతో సమీక్ష



వై.జంక్షన్ రైతు బజార్‌ను పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 96 శాతం మాత్రమే సీసీఆర్సీ కార్డులు నమోదు జరిగిందని, క్షేత్రస్థాయిలో అధికారులు వంద శాతం నమోదు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో ఆయన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఈ-క్రాప్‌లో ప్రభుత్వం అమలు చేసే రాయితీలన్నీ వ్యవసాయ, అనుబంధ శాఖలోని అన్ని పథకాలకు ప్రామాణికంగా తీసుకుంటామన్నారు. జిల్లాలో నూరుశాతం సీసీఆర్సీ కార్డుల లక్ష్యంలో 53,060కి గాను 50,907 మందికి జారీ చేసినట్టు తెలిపారు. పంటల బీమా, ధాన్యం కొనుగోలు తదితర వివరాల్ని వెబ్ ల్యాండ్‌తో కూడి పంట సాగు ధ్రువీకరణ పత్రాలు, ఈ-ఫిష్ డేటాలతో అనుసంధానిస్తామన్నారు. ప్రస్తుత ఖరీఫ్ ఈ-పంట నమోదు ప్రారంభమైందన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి పి.విజయ భాస్కర్ మాట్లాడుతూ డివిజన్ మండలాల్లో రేషన్ దుకాణాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసేందుకు, రైస్ మిల్లు దగ్గర నుంచి ముందుగా 50 శాతం గన్ని బ్యాగ్స్ తీసుకొని రైతులకు ఆయా కొనుగోలు, రైతు సేవా కేంద్రాలలో సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనేలా చైతన్యం కల్పించాలని వ్యవసాయశాఖ అధికారి మాధవరావు కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కేఎల్ శివజ్యోతి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, బి.సుజాత కుమారి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

నాణ్యమైన కూరగాయలు అందించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతు బజార్లలో వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. మంగళవారం ఆయన క్వారీసెంటర్, వై.జంక్షన్, మార్కెట్ యార్డుల్లోని రైతు బజార్లను పరిశీలించారు. కూరగాయల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, కంది పప్పు ప్రత్యేక కౌంటర్లను జేసీ పరిశీలించారు. జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.ఉదయభాస్కర్, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు కె.శ్రీనివాస్, రోజియా, ఇ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ పెట్రోల్ బంక్ ప్రారంభిస్తాం

- స్వచ్ఛంద సంస్థ ద్వారా నగరంలోని పార్కుల నిర్వహణ చేపడతాం
- కమిషనర్ కేతన్ గార్గ్



నగరంలో పర్యస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పెట్రోల్ బంక్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషను లిమిటెడ్ ప్రతినిధులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని పార్కులను స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్, దాతలకు అప్పగించే ఆలోచన చేస్తున్నామన్నారు. నగరంలో క్వారీ మార్కెట్ జంక్షన్ సమీపంలో నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషను లిమిటెడ్ ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ వాహనాలతో పాటు బయట వాహనాలకు డీజిల్, పెట్రోల్ అమ్మకాలు చేస్తారన్నారు. దాని ద్వారా వచ్చే కమీషన్ నగరపాలక సంస్థకు చెందుతుందన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషను లిమిటెడ్ బంకు నిర్మాణం పూర్తి చేసి అప్పగించగా నిర్వహణ మొత్తం నగరపాలక సంస్థ చేపడుతుందన్నారు. అనంతరం ఆంధ్రకేసరి కాలేజీ వద్ద నిర్మించిన పార్కును సందర్శించారు. నగరంలో పార్కుల నిర్వహణ స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, దాతలకు అప్పగించే ఆలోచన ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనరు ఎస్.వెంకటరమణ, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలాజి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషగిరిరావు, మదర్సా ఆలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రసాద్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర



వేమగిరి ముత్యాలమ్మవారిని దర్శించుకున్న మంత్రి కందుల దుర్గేష్

కడియం: వేమగిరి గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మూడేళ్లకోసారి జరిగే ఈ జాతర మహోత్సవానికి ఎక్కడెక్కడో స్థిరపడిన గ్రామస్తులందరూ వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయాన్నే అమ్మవారికి పూజలు చేసి, దర్శనానికి భక్తులను అనుమతించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేశంలో ప్రతినిత్యం ఆడపిల్లల మీద అఘాయిత్యాలు జరగడం బాధాకరమని, దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి స్థానిక కోటిపల్లి బస్టాండ్ నుంచి డీలక్స్ సెంటర్ వరకూ టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి ఆధ్వర్యంలో కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కె.సుధాకర్, రూరల్ మండల తెదేపా అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మలిపొద్దులో మురిపిస్తూ..





రాజమహేంద్రవరం సిటీ: ప్రకృతి చిత్రం మనసుకి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎంత చిత్రమో కదా.. తొలిపొద్దు నుంచి భగ్గుమనే భానుడు మలిపొద్దులో కొండల మధ్య వాలిపోతూ పసుపు పచ్చని నిమ్మపండు రంగులో మబ్బుల మధ్య దాక్కుంటూ మనసుకు ఎంతో ఆనందాన్ని కలిగించాడు. మంగళవారం సాయంత్రం రోడ్ కం రైలు బ్రిడ్జి, ఆధ్యాత్మిక ప్రాంతం పుష్కరఘాట్‌ల వద్ద పడమటి సంధ్య ఇలా కనిపిస్తూ అందరినీ అబ్బుర పరిచింది.

లక్ష్య సాధనపైనే గురి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయాలను గుర్తెరిగి వ్యవహరించడంతోపాటు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలనే తపనతో నిరంతరం కృషి చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన బిటెక్ ఫస్టియర్ విద్యార్థులకు మంగళవారం »దీక్షారంబ్« పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చదువులో చురుగ్గా ఉండడమే కాకుండా నైపుణ్యాభివృద్ధిలోను సరైన పట్టును సాధించిన వారికి రాబోయే కాలంలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సరైన లక్ష్యం, ప్రణాళిక, అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.